సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



శునకంపై 'శస్త్ర'అస్త్రం

'ఆపరేషన్ డాగ్'తో వీధికుక్కల సంతతిని నియంత్రించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇది సక్సెస్ అయితే శునక బెడద తప్పినట్టే. - 8లో



ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోరా?

పరిశుభ్రత పాటించాలని ఎన్నిసార్లు చెప్పినా.. మీరు తీరు మార్చుకోరా?' అని కలెక్టర్ అధికారులపై మండిపడ్డారు. - 8లో



విన్నపాలకు విలువేదీ?

రెవెన్యూ సదస్సుల్లో నమోదైన అర్జీలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో విన్నపానికి విలువేదని రైతులు అంటున్నారు. - 8లో

న్యూస్‌రీల్

13 న షబే బరాత్ పండుగ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ముస్లింలు అందరూ ఈనెల 13వ తేదీన షబే బరాత్ పండుగ జరుపుకోవాలని జిల్లా ప్రభుత్వ ఖాజీ సయ్యద్ మోహమ్మద్ కమాలుల్లా జుహూరి లతీఫ్ జునైది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరణించిన తమ పూర్వీకుల ఆత్మ శాంతి కోసం షబే బరాత్ పండుగ సందర్భంగా ముస్లింలందరూ ఈ పండుగ రోజు రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు.

బినామీ మస్టర్లకు చెక్

ఎన్ఎంఎంఎస్ హాజరు తప్పనిసరి చేసిన కేంద్రం



గుడిపాలలో పనులు ప్రారంభిస్తున్న ఉపాధి కూలీలు

గుడిపాల: ఉపాధిహామీ పథకంలో బినామీ మస్టర్లకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం హాజరు నిబంధనలను కఠినతరం చేసింది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్ఎంఎంఎస్) తప్పనిసరి చేసింది. ప్రతిరోజూ పనిచేసే చోట ఫొటో తీసి ఎన్ఎంఎంఎస్ ఆన్‌లైన్‌లో హాజరు వేయాలి. కొంతమంది ఉపాధి సిబ్బంది సెల్ ఫోన్‌లు పనిచేయడం లేదని, సర్వర్ సమస్య ఉందని చెప్పి హాజరును సాధారణ పద్ధతిలో వేసేవారు. బినామీ మస్టర్లు వేసి, నిధులు స్వాహా చేసేవారు. ఇకపై ఎన్ఎంఎంఎస్ హాజరు వేసిన వారికి మాత్రమే వేతనాలు చెల్లిస్తారు. జిల్లాలో 31 మండలాలకు సంబంధించి 700 పంచాయతీల్లో 2.68 లక్షల జాబ్‌కార్డులున్నాయి. 4.80లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో రోజుకు సుమారు 2.10 లక్షల మంది వరకు ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నారు. వీరందరికీ ఇకపై ఎన్ఎంఎంఎస్ లోనే హాజరు వేయాలని, సాధారణ పద్ధతిలో వేస్తే పరిగణనలోకి తీసుకోమని డ్వామా అధికారులు తెలిపారు.


బైరెడ్డిపల్లెలో జెడ్పీ సీఈఓ తనిఖీలు



మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ

బైరెడ్డిపల్లె: జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు గురువారం బైరెడ్డిపల్లె మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలను ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, తాగునీటి సమస్యపై ఆరా తీశారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం బైరెడ్డిపల్లె ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించి, సమస్యలను అడిగితెలుసుకున్నారు. జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీ, పీఆర్ఏఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ద్రవిడ వర్సిటీలో 8 మంది ఉద్యోగుల తొలగింపు



ద్రవిడ విశ్వవిద్యాలయం

కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయంలో 8 మంది తాత్కాలిక ఉద్యోగులను తొలగించారు. వర్సిటీలో తాత్కాలిక పద్ధతిలో విధులు నిర్వహిస్తూ దీర్ఘకాలిక సెలవు పెట్టి విధులు హాజరు కాకపోవడం, రెగ్యులర్‌గా విధులకు హాజరుకాకుండా నామమాత్రంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను గురువారం తొలగించారు. ఇదివరకే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఉద్యోగులు విధులకు హాజరు కావాలని రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ సర్క్యులర్‌ను జారీ చేశారు. అలా విధులకు హాజరుకాని ఉద్యోగులను తొలగిస్తామని హెచ్చరించగా.. పలువురు ఉద్యోగులు విధుల్లోకి చేరారు. అయితే విధులకు హాజరు కాని ఉద్యోగులను శాశ్వతంగా తొలగించారు.

డీఎడ్ పరీక్ష ఫీజు చెల్లించండి

చిత్తూరు కలెక్టరేట్ : డీఎడ్ మొదటి, మూడో సెమిస్టర్, వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ వరలక్ష్మి సూచించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రూ.50 అపరాధరుసుంతో ఈ నెల 14 వ తేదీ వరకు అభ్యర్థులు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు చెల్లించిన ఫీజును ప్రిన్సిపాళ్లు ఈ నెల 15వ తేదీన చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అప్‌డేట్ చేసేందుకు అవకాశం కల్పించారని ఆమె తెలిపారు.

మిత్రభేదం

జిల్లా కేంద్రమైన చిత్తూరులో కూటమి నేతలు ప్రజా సమస్యలను గాలికొదిలి పనుల కోసం ఫైటింగ్ చేసుకుంటున్నారు. టీడీపీ, జనసేన నేతలు అభివృద్ధి పనుల టెండర్ల విషయంలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా టెండర్లు వేసి, గొడవలు పడుకుంటున్నారు. టీడీపీ నేతలు వారెవరు ఇక్కడ బిడ్లు వేయడానికి ప్రశ్నిస్తే.. మమ్మల్ని అడగడానికి వారెవరంటూ.. నువ్వా.. నేనా అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. మిత్ర ధర్మం పాటించలేదని ఒకరంటే.. అసలు ధర్మమే పాటించలేదని ఎదుటి వర్గం మండిపడుతోంది. ఇలా చిత్తూరులో కూటమిలో కుంపట్లు రగులుతున్నాయి.





- కూటమిలో కుంపట్లు
- ప్రజా సమస్యలు గాలికొదిలి పనుల కోసం టీడీపీ, జనసేన ఫైట్
- రూ.3 కోట్ల టెండర్లలో కాలు దువ్వుకుంటున్న ఇరువర్గాలు
- పంచుకున్న పనుల్లో.. తిరుపతి ఎమ్మెల్యే అనుచరుల బిడ్
- ఆ టెండర్లను ఉపేక్షించొద్దంటున్న చిత్తూరు ఎమ్మెల్యే వర్గం

చిత్తూరు అర్బన్: చిత్తూరులో కూటమి పార్టీ నేతల మధ్య విభేదాలు తలెత్తాయి. మిత్రధర్మం పాటించడంలేదంటూ జనసేన.. అసలు ధర్మం పాటించారా..? అంటూ టీడీపీ నేతలు. ఇలా ఒకరి మధ్య ఒకరు మాటల తూటాలు పేల్చుకుంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఈ విభేదాలకు వేదికగా మారుతోంది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో దాదాపు రూ.3 కోట్ల అభివృద్ధి పనులు చేయడానికి మున్సిపల్ సాధారణ పద్దుల నుంచి ఇటీవల అధికారులు ఆన్‌లైన్ టెండర్లు పిలిచారు. వీటిలో ఎవరు ఎంత విలువ చేసే పనులు చేయాలో స్థానిక టీడీపీ నేతలకు ముందుగానే కేటాయింపులు చేసేశారు. 26కు పైగా పనులకు టెండర్లు పిలవగా.. ముందుగా అనుకున్నట్టు టీడీపీ కార్పొరేటర్లు, కొందరు టీడీపీ మద్దతుదారులు, వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన కార్పొరేటర్ల మద్దతు ఉన్న కాంట్రాక్టర్లు పనులకు టెండర్లు వేశారు. దాదాపు 90 శాతానికి పైగా పనులను ముందుగా అనుకున్న వాళ్లే బిడ్లు వేసుకున్నారు. కొన్ని పనులకు సింగిల్ టెండర్లు కూడా పడ్డాయి. అయితే మూడు రోజుల క్రితం టెండర్లను ఓపెన్ చేసిన అధికారులు ఆ వివరాలను నాయకుల ముందుంచారు. ఇందులో ఎవరూ ఊహించని విధంగా పలువురు కొత్త వ్యక్తులు టెండర్లు దాఖలు చేయడాన్ని టీడీపీ నేతలు గుర్తించారు. ఇక అక్కడి నుంచే అసలు కథ మొదలైంది.

వాళ్లను వేయమని చెప్పిందెవరు?

ఇవన్నీ ఆన్‌లైన్ టెండర్లైనప్పటికీ ఏఏ పనులు ఎవరు చేసుకోవాలో ముందుగానే అనుకున్నారు. కానీ తిరుపతి ఎమ్మెల్యే అనుచరులు పలు పనులకు టెండర్లు వేసేశారు. దీనిపై చిత్తూరు ఎమ్మెల్యే వర్గానికి చెందిన అనుచరులు మండి పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ చిత్తూరుకు వచ్చి కనీసం ఓటు కూడా వేయని వ్యక్తి, అతని అనుచరులు టెండర్లలో ఎలా పాల్గొంటారని ప్రశ్నిస్తున్నారు. రెండు వేర్వేరు పేర్లతో దాదాపు రూ.కోటి వరకు విలువైన పనులకు టెండర్లు దాఖలు చేయడం విడ్డూరంగా ఉందని బహిరంగంగానే ధూషిస్తున్నారు. 'జనసేన టీడీపీతో పెట్టుకున్న మిత్రధర్మం చూసి ఊరుకుంటున్నాం. ఏంటో ఆయన, ఆయన అన్నకొడుకు వాళ్లకు సంబంధం లేకున్నా చిత్తూరు రాజకీయాల్లో వేలు పెడుతున్నారు. అసలు ఎవర్ని అడిగి టెండర్లు వేశారు..? ఇక్కడి ఎమ్మెల్యేకు ఓ మాటైనా చెప్పారా..? మేము వెళ్లి తిరుపతిలో టెండర్లు వేస్తే గమ్మున ఉంటారా..?'' అంటూ కార్పొరేషన్‌కు చెందిన ఓ కీలక నేత అందరి ముందే విమర్శల బాణం ఎక్కుపెట్టారు.

మీరేంది మాకు చెప్పేది?

దీనిపై జనసేన పార్టీకు చెందిన నాయకులు కూడా ఘాటుగానే సమాధానమిస్తున్నారు. 'ఆన్‌లైన్ టెండర్లు వేయడానికి మేము ఎవరి అనుమతి తీసుకోవాలి.? మేము కూడా ఓట్లు వేశాం. చిత్తూరులో టీడీపీ అభ్యర్థి గెలుపులో మా సామాజిక వర్గమే కీలక పాత్ర పోషించింది. వీళ్ల వాళ్లు అస్సలు పనిచేయలేదు. పైకి మాత్రం బాగా తిరుగుతున్నట్లు నటించి, పోలింగ్ రోజున సైలెంట్ అయిపోయారు. వీళ్లా మాకు చెప్పేది..? చిత్తూరు మేయర్ మా అన్నే.. దీనిపై ఇప్పటికే మాకు క్లారిటీ ఇచ్చారు. అలాంటిది ఇక్కడ ఎలా పట్టు కోల్పోతాం?'' అంటూ చిత్తూరులోని జనసేనకు చెందిన పలువురు తిప్పి కొడుతున్నారు. చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయం వేదికగా జరుగుతున్న ఈ తంతంగం ముమ్ముందు కూటమి నేతల్లో మధ్య ఎలాంటి ఘటనలకు దారితీస్తుందో వేచి చూడాలి.



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

శతాధిక వృద్ధుడి మృతి



వెంకటప్పనాయుడు(ఫైల్), ఆధార్ కార్డ్

చౌడేపల్లి: శతాధిక వృద్ధుడు దిగువపల్లె పంచాయతీ అప్పినేపల్లెకు చెందిన కంచం వెంకటప్ప నాయుడు(102) మృతి చెందినట్లు బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శివప్పనాయుడు గురువారం తెలిపారు. ఆధార్ కార్డులో జనన తేదీ మేరకు ఆయనకు 102 ఏళ్లు నిండాయన్నారు. శుక్రవారం అప్పి నేపల్లెలో అంత్యక్రియలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయన మృతిపై పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

రుణ దరఖాస్తుల గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుల గడువు పొడిగిస్తున్నట్లు ఆ శాఖ ఈడీ శ్రీదేవి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 12వ తేదీ వరకు గడువు పెంచారన్నారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 58,600 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రోడ్డెక్కిన మృతుల బంధువులు



పన్నూరు సబ్‌స్టేషన్‌లో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

- ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకోవాలని డిమాండ్
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ

విజయపురం : ఇద్దరి మరణానికి కారణమైన వాహనాన్ని వెంటనే పట్టుకుని తమకు న్యాయం చేయాలని రవి, మంజుల కుటుంబ సభ్యులు గురువారం మధ్యాహ్నం రోడెక్కారు. పన్నూరు సబ్‌స్టేషన్ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో నిరసన పట్టారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 7 గంటల వరకు ధర్నా చేయడంతో పన్నూరు, తిరుత్తణి రోడ్డుపై రాకపోకలు స్తంభించాయి. నింద్ర మండలం, అగరంపేట దళితవాడకు చెందిన రవి, కేవీబీపురం మండలం, కొల్లత్తూరు దళితవాడకు చెందిన మంజుల బుధవారం రాత్రి తెల్లగుంట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదానికి కారణమైన వాహనాన్ని వెంటనే పట్టుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు ధర్నా చేశారు. న్యాయం జరిగే వరకు ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని తీసుకోబోమని నిరసన కొనసాగించారు. అనంతరం నగరి రూరల్ సీఐ భాస్కర్, విజయపురం ఎస్ఐ బలరాం రెండు రోజుల్లో విచారణ జరిపి వాహనాన్ని పట్టుకుంటామని చెప్పడంతో నిరసన విరమించారు.

వరించిన కాలం



వరుణుడు కరుణించాడు.. చెరువులు, బావులు నిండుకుండలయ్యాయి.. పుడమి పుత్రుడు ఏరువాక సాగాడు..హలాలు పట్టి పొలాలు దున్ని.. సాగుకు సన్నద్ధమయ్యాడు.. అతివలతో వరినాట్లు వేయిస్తున్నాడు.. ఈ చిత్రాలు సదుం మండలంలో ఏ గ్రామంలో చూసినా రమణీయంగా కనిపిస్తున్నాయి. – సదుం



కర్ణాటకకు యథేచ్ఛగా తరలుతున్న రేషన్ బియ్యం (ఫైల్)

అక్రమకూటమి

అగ్గిపుల్ల..సబ్బు బిళ్ల కాదేదీ అనర్హం అక్రమ రవాణాకు అన్న చందంగా పలమనేరు కేంద్రంగా రేషన్ బియ్యం మొదలుకుని పర్మిట్ లేని గ్రానైట్ వరకు అన్ని అక్రమ వ్యాపారాల్లో కూటమి నేతలు అక్రమార్కులతో సిండికేట్ అయ్యారు. ఈ అక్రమ'కూటమి' దెబ్బకు ఆయా శాఖల అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా పలు ప్రకృతి వనరులతోపాటు మరిని అక్రమవ్యాపారాలు మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతున్నాయి.

- పలు వ్యాపారాల్లో కూటమి నేతల సిండికేట్
- యథేచ్ఛగా అక్రమ రవాణా
- నోరుమెదపని అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పలమనేరు.. అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దు. దీంతో పలమనేరు కేంద్రంగా పలు అక్రమ వ్యాపారాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మొన్నటివరకు అక్రమార్కుల ఆటలు సాగనీయకుండా సంబంధిత అధికారులతో అక్రమార్కులకు కూటమి నేతలు ముకుతాడు వేయించారు. ఆపై స్మగ్లర్లతోనే మిలాఖత్ అయి, మీకెంత.. మాకెంత? అని డీల్ కుదుర్చుకున్నారు. సిండికేట్‌లో భాగస్వాములయ్యారు. దీంతో పలమనేరు కేంద్రంగా అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారు. కూటమి నేతలు భాగస్వాములు కావడంతో సంబంధిత అధికారులు అక్రమాలను చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు.

అక్రమ వ్యాపారాల్లో కూటమి నేతల భాగస్వామ్యం

పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు చోట్ల నుంచి ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని కర్ణాటకలోని బంగారుపేటకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కన్నేసిన ఎమ్మెల్యేకు అన్నీ తానేనంటూ చెప్పుకుంటున్న ఓ యువకుడు బియ్యం స్మగ్లర్లతో డీల్ చేసుకుని అతని సారథ్యంలో బియ్యం అక్రమ రవాణా చేయిస్తున్నట్టు సమాచారం. అలాగే పట్టణంలో సాగే లాటరీ వ్యవహారాల్లో తమిళనాడుకు చెందిన ముగ్గురు ఈ ప్రాంతంలో కీలకంగా మారి గతంలో సంబంధిత శాఖలకు మామూళ్లు ఇస్తూ లాటరీలు నిర్వహించేవారు. ఇప్పుడు పచ్చపార్టీకి చెందిన ఓ యువనేత ఇందులో కీలక భాగస్వామిగా మారి దందా చేయిస్తున్నట్టు సమాచారం. ఇక పుంగనూరు, పెద్దపంజాణిలోని రాయలపేట నుంచి నిత్యం నాలుగైదు లోడ్ల పశువులను తమిళనాడులోని కబేళాలకు పట్టపగలే తరలిస్తున్నారు. ఈ విషయం పోలీసుల కళ్ల ముందే సాగుతోంది. అయితే ఇక్కడి ఓ కీలక నేత పశువుల అక్రమరవాణాను లీడ్ తీసుకొని నడిపిస్తున్నట్టు తెలిసింది. పొరుగునే ఉన్న తమిళనాడుకు అక్కడి కూటమి నేతలు స్మగ్లర్లతో సిండికేట్‌గా ఏర్పడి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇక పర్మిట్లు లేని గ్రానైట్ అక్రమరవాణా సాగిస్తున్నారు. మైనింగ్ అధికారులకు తెలిసినా వారు కిమ్మనకుండా వదిలేసినట్టు తెలిసింది. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ సెటిల్‌మెంట్లకు సంబంధించి పచ్చనేతల ఆధ్వర్యంలో జోరుగా సాగుతోంది. ఆయా ఎమ్మెల్యేల పేరు చెప్పి రెవెన్యూ అధికారులతో వీరు దందాలను సాగిస్తున్నారు. అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సైతం కూటమి నేతలు తమ గుప్పిట్లోకి తీసేసుకున్నారు. ఇప్పుడు అడుగు స్థలంపై ఎంత ధర నిర్ణయించాల్లో కూటమికి చెందిన రియల్టర్లు నిర్ణయిస్తున్నారు. చివరకు చికెన్ ధరల నిర్ణయంలోనూ కూటమి సిండికేట్‌లే నిర్ణయించి భారీగా దోపిడీకి పాల్పడుతున్న చికెన్ చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మకు నీరెత్తిన చందంగా అధికారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూటమినేతలే స్మగ్లర్లతో కలిసి అక్రమ వ్యాపారాలు చేస్తుండడంతో ఆయా శాఖల అధికారులు సైతం మీరేమన్నా చేసుకోండి మాకు సంబంధం లేదనట్టు వ్యవహరిస్తున్నారు. వీరిలో ఎవరైనా నిజాయితీ కలిగిన అధికారి ఈ అక్రమాలను ప్రశ్నిస్తే అతనికి బదిలీలు తప్పవనేమాట ఇక్కడ వినిపిస్తోంది.





తమిళనాడుకు తరలుతున్న అక్రమ గ్రానైట్



పుంగనూరు నుంచి కబేళాలకు తరలిస్తున్న పశువులు

అర్జీల పరిష్కారానికి పకడ్బందీగా చర్యలు

- రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించాలి
- వరుస సమీక్షల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



చిత్తూరు కలెక్టరేట్ : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖలతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో నమోదైన ప్రతి అర్జీని కచ్చితంగా పరిష్కరించాలన్నారు. అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించేలా తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలన్నారు. జిల్లా స్థాయిలో అర్జీలు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి, అర్జీదారునికి సమాచారం ఇచ్చి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా కార్యాలయంలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడికి ముందస్తు చర్యలు

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడికి ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ తెలిపారు. ప్రతి మండలంలో ప్రస్తుతం ఉన్న నీటి వనరులను గుర్తించాలన్నారు. నీటి వనరుల స్థితిగతుల పై మార్చి 15వ తేదీ వరకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సర్వేలో బోర్‌వెల్స్, చేతి పంపుల నిర్వహణ పూర్తి వివరాలను పక్కాగా నమోదుచేసి నివేదికలు ఇవ్వాలన్నారు. ఈ సమీక్షలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కీచక టీచర్ సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడిపై వేటు పడింది. ఆ టీచర్‌ని సస్పెండ్ చేస్తూ డీఈఓ వరలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని కట్టమంచి నగరపాలక ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ధనశేఖర్ బాలికలతో అసభ్యంగా ప్రవర్తించారు. ఆ ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన తీరుపై ఇటీవల ఆ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులు విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు చిత్తూరు ఎంఈఓ–2 మోహన్ విచారణ జరిపారు. అనంతరం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ధనశేఖర్ అసభ్యంగా ప్రవర్తించాడని తేలడంతో ఈ మేరకు నివేదికలను డీఈఓకు అందజేశారు. దీంతో ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆ ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బైరెడ్డిపల్లె: మండలకేంద్రానికి సమీపంలోని పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ పరుశురాముడు కథనం మేరకు.. మండలంలోని మిట్టపల్లె గ్రామానికి చెందిన మునెప్ప (69) గురువారం ఉదయం బాటగంగమ్మ ఆలయం, ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించాడు. అనంతరం గ్రామానికి కాలినడకన వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. దీంతో మునెప్ప అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

టెంపో ఢీ కొని ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న స్థానికులు

బైరెడ్డిపల్లె: కుప్పం–పలమనేరు జాతీయ రహదారిలోని చీలంపల్లె సమీపంలో ఉన్న మునినారాయణ కళాశాల వద్ద గురువారం ద్విచక్ర వాహనాన్ని టెంపో ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మండలంలోని మురారిపల్లెకు చెందిన భవ్యశ్రీ మునినారాయణ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. సాయంత్రం కళాశాల ముగిసిన తరువాత భవ్యశ్రీ తన బాబాయి మంజునాథరెడ్డితో కలసి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరింది. మునినారాయణ కళాశాల ఎదురుగా జాతీయరహదారిపై రాగానే వీరి బైక్‌ను టెంపో ఢీ కొంది. దీంతో భవ్యశ్రీ , మంజునాథ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి, క్షతగాత్రులను బైరెడ్డిపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కుప్పం పీఈఎస్‌కు తరలించారు.

శునకంపై 'శస్త్ర' అస్త్రం

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సింహాలు దారి కాసి దాడి చేస్తున్నాయి. ఫలితంగా పలువురు కుక్కకాటుకు గురై ఆస్పత్రి పాలవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి శునకాలపై కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల అస్త్రం ప్రయోగించనున్నారు. ఇందుకు అంతా రంగం సిద్ధం చేసినప్పటికీ ఆ పనులు దక్కించుకున్న ఏజెన్సీ చేతులెత్తేసింది. దీంతో పశుసంవర్ధకశాఖ అధికారులు రంగంలోకి ఆపరేషన్ డాగ్ పేరుతో శునకాల సంతతి నియంత్రణకు చర్యలు తీసుకోనున్నారు. దీనిపై కథనం.

ఆపరేషన్ డాగ్..!

- గ్రామ సింహాల సంతతి నియంత్రణకు కు.ని.
- చిత్తూరులో శునకాల ఏబీసీ కేంద్రం
- జిల్లాలోని కుక్కలన్నింటికీ ఇక్కడే శస్త్ర చికిత్సలు
- పనులు దక్కించుకున్నా.. ముందుకురాని ఏజెన్సీ
- కలెక్టర్ అసహనం.. రంగంలోకి పశు సంవర్ధకశాఖ
- వచ్చేవారం ప్రారంభానికి యంత్రాంగం సన్నాహాలు





చిత్తూరు మునిసిపల్ గ్యారేజీలో నిర్మించి కుక్కల షెడ్డు (ఇన్‌సెట్) చిత్తూరు నగరంలో కుక్క కరవడంతో ఓ వృద్ధురాలి పరిస్థితి (ఫైల్)

జిల్లాలో వీధి కుక్కల గణాంకాల పరిస్థితి	
పట్టణాల్లో కుక్కల సంఖ్య **24** వేలు	గ్రామీణ ప్రాంతాల్లోని శునకాలు **30** వేలు
ఆస్పత్రుల్లో కుక్క కాటు బాధితులు **16** మంది (రోజుకు)	కుటుంబ నియంత్రణ కోసం ఖర్చు దాదాపు రూ.**45** లక్షలు (ఏటా)



గుడిపాలలో వీధి కుక్కలు

చిత్తూరు అర్బన్: కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నది నానుడి. వీధి కుక్కలను పట్టుకుని వాటి సంతానం పెరగకుండా ఉండేందుకు తీసుకుంటున్న చర్యలు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడం..రంగంలోకి పశు సంవర్ధకశాఖ వైద్యులు దిగడంతో కుక్కకాట్లకు చెక్‌పెట్టే దిశగా 'ఆపరేషన్ డాగ్' ద్వారా వీధి కుక్కల సంతతిని నియంత్రించే సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా అంతటా వీధి కుక్కల బెడద అంతా ఇంతా కాదు. ఎప్పుడు ఎవర్ని కరుస్తాయో తెలియని పరిస్థితి. కుక్కకాటు కన్నా.. దానికి వేసుకోవాల్సిన సూదులను తలచుకుంటేనే సగం మంది వణికిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 54 వేల వీధి కుక్కలు ఉన్నట్లు అధికారుల అంచనా. గతంలో తిరుపతికి చెందిన ఓ ఏజెన్సీ ద్వారా కుక్కలను పట్టుకెళ్లడం, కు.ని చేసి పట్టుకున్నచోటే శునకాల్ని వదిలి వెళ్లేవాళ్లు. వంద కుక్కలు పడితే మున్సిపల్ అధికారుల లెక్కల్లో వెయ్యి రాసేసుకుని, 900 కుక్కలకు చెల్లించే బిల్లులను యంత్రాంగం జేబుల్లో కుక్కునేవారు. ఇదో ఆదాయ వనరుగా మార్చుకున్న పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీ) జిల్లాలో చాలా ఉన్నాయి.

శస్త్ర చికిత్సలతో నియంత్రణ

చిత్తూరు నగరంలో వీధి కుక్కలను పట్టుకుని, వాటికి కు.ని. చేయడం కోసం గుజరాత్‌కు చెందిన ఓ సంస్థకు కూటమి ప్రభుత్వం పనులు అప్పగించింది. కుక్కను పట్టుకొచ్చి కు.ని. చేయడం, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయడం, మూడు రోజుల పాటు దాన్ని పర్యవేక్షించడం, తిండి పెట్టడం చేయాలి. ఇందుకోసం ఒక్కొక్క శునకానికి రూ.1500 చొప్పున ఆయా మున్సిపాలిటీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ నిర్వహించడానికి సంబంధిత ఏజెన్సీకి కుక్కలు పట్టుకునే వాహనం, శస్త్రచికిత్స కోసం పరికరాలు, కుక్కల్ని సంరక్షించే బోనులు అన్నీ కూడా మున్సిపాలిటీలే సమకూర్చాలి. తొలిసారిగా చిత్తూరు కార్పొరేషన్ గ్యారేజ్ షెడ్డులో ఓ చిన్నపాటి భవనంలో శునకాల కోసం యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాన్ని నిర్మించారు. ఇందులో కేవలం 20 కుక్కల్ని మాత్రమే ఉంచడానికి వీలవుతుందని, ఇలాగైతే తమకు గిట్టుబాటుకాదని ఏజెన్సీ నిర్వాహకులు ఆసక్తి చూపడంలేదన్నది అధికారుల వాదన. రోజురోజుకు పెరుగుతున్న వీధి కుక్కల సమస్యపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. కుక్కలకు కు.ని. చేయడానికి పశు సంవర్ధక శాఖ వైద్యులు, యంత్రాంగం రంగంలోకి దిగారు. ఇప్పటికే పది మంది వైద్యులు, సిబ్బందికి మూడు రోజుల పాటు శిక్షణ కూడా పూర్తి చేశారు. మరో పది రోజుల్లో శునకాలకు కు.ని. చేయడానికి సన్నాహాలు ప్రారంభిస్తున్నారు. ఇందులో సానుకూలత కనిపిస్తే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కుక్కలకు చిత్తూరులో శస్త్ర చికిత్సలు చేయించే విషయం కూడా కలెక్టర్ పరిశీలిస్తున్నారు. ఆపరేషన్ డాగ్ ప్రక్రియ మొదలైతే తప్ప.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటన్న అంశంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

అంతా సిద్ధం



"వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ, వాక్సిన్ వేసే ప్రక్రియ కోసం భవన నిర్మాణం మొత్తం పూర్తయ్యింది. గుజరాత్‌కు చెందిన ఏజెన్సీ వాళ్లు కొన్ని కండీషన్లు పెడుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో పశుసంవర్ధకశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వారితోనే ఈ కార్యక్రమం ప్రారంభిస్తాం. ఇందులో సక్సెస్ అయితే మిగిలిన యూఎల్‌బీలు కూడా శునకాలను ఇక్కడకు తీసుకొచ్చి శస్త్ర చికిత్స చేయించాలన్నది కలెక్టర్ ప్రణాళిక. పది రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దాదాపు వంద కుక్కల్ని ఒకే చోట ఉంచేలా షెడ్డును నిర్మించడానికి స్థలాన్ని కూడా అన్వేషిస్తున్నాం.

– డాక్టర్ లోకేష్, ప్రజారోగ్యశాఖ అధికారి, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్

ఇద్దరికి ఐదేళ్లు జైలు



ముద్దాయిలతో పోలీసులు

చిత్తూరు అర్బన్: దాడి చేసిన కేసులో ఇద్దరి నిందితులకు ఐదేళ్లు జైలుశిక్ష విధిస్తూ గురువారం స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎంవీఎన్ పద్మజ తీర్పు చెప్పారు. ఏపీపీ శైలజ కథనం మేరకు.. బంగారుపాళెం మండలం టేకుమంద గ్రామానికి చెందిన శ్రావణకుమార్‌కు పుంగనూరు మండలం ఎల్లారుబైలు వాసి రోజాతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఓ కుమార్తె ఉంది. శ్రావణకుమార్ మద్యం సేవించి ఇంటికొచ్చేవాడు. భార్యభర్తలు గొడవపడేవారు. ఈ కారణంగా 'నీ కూతురిని తీసుకెళ్లిపో.. లేకపోతే చంపేస్తానని' మామ గంగులప్పకు ఫోన్ ద్వారా శ్రావణకుమార్ తెలిపాడు. దీంతో 2022 జులై 18న కుమారులతో కలసి గంగులప్ప టేకుమందుకు వచ్చి అల్లుడిని ప్రశ్నించగా మాటమాట పెరిగింది. దీంతో శ్రావణ కుమార్, అతని తండ్రి సుబ్రహ్మణ్యం కలిసి కత్తులతో గంగులప్ప, ఆయన కుమారుడుతో పాటు అన్న కొడుకు వినోద్, సురేంద్రపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై గంగులప్ప కుటుంబ సభ్యులు బంగారుపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు నిందితులు శ్రావణకుమార్(35), తండ్రి సుబ్రహ్మణ్యం(62)పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. పూర్వపరాలను పరిశీలించిన అనంతరం నేరం రుజువుకావడంతో నిందితులకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోరా?

- ట్రెజరీ, కార్మిక శాఖల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
- కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ



ట్రెజరీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : 'కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించి శుభ్రంగా ఉంచుకోవాలని ఎన్నిసార్లు చెప్పినా.. మీరు తీరు మార్చుకోరా?' అని ట్రెజరీ, కార్మిక శాఖల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కలెక్టర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది విధుల నిర్వహణ, కార్యాలయాల పరిశుభ్రత పరిశీలించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. గతంలో పలు సార్లు కలెక్టరేట్‌లోని పలు శాఖలను ఆకస్మికంగా తనిఖీ చేసి శుభ్రంగా పెట్టుకోవాలని ఆదేశించారు. అప్పుడు కలెక్టర్ చేసిన తనిఖీతో ప లు శాఖల్లో పరిశుభ్రత విషయంలో సిబ్బంది తమ పనితీరును మార్చుకున్నారు. అయితే కొన్ని శాఖలు తమ తీరును మార్చుకోలేదు. దీంతో గురువారం కలెక్టర్ మరోసారి పలు శాఖలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో జిల్లా ట్రెజరీ డీడీ, కార్మిక శాఖ కార్యాలయాల్లో అపరిశుభ్రత వాతావరణం కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమయపాలన ఖచ్చితంగా పాటించాలి

కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. సమయపాలన పాటిస్తూ కార్యాలయ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కలెక్టరేట్‌లోని వివేకానందభవన్, జ్యోతిరావుపూలే భవనాలకు రంగులు వేయించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ట్రెజరీ, కార్మిక శాఖల్లో ఖాళీగా ఉన్న వస్తువులను, ఫైళ్లను సక్రమంగా పెట్టుకోవాలన్నారు. నిరుపయోగ వస్తువులను తొలగించాలన్నారు. కలెక్టరేట్‌లో వాహనాల పార్కింగ్‌కు నూతనంగా షెడ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఏఓను ఆదేశించారు.

నాణ్యతలో అగ్రగామి భారతి సిమెంట్

- తాపీమేస్త్రీలకు బీమా బాండ్ల పంపిణీ
- సాటిలేని మేటి సిమెంట్ భారతి
- అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు



బీమా బాండ్లు చూపుతున్న భవన నిర్మాణ కార్మికులతో భారతి సిమెంట్ ప్రతినిధులు

ఐరాల: నాణ్యతలో భారతి సిమెంట్ అగ్రగామిగా కొనసాగుతుందని ఆ కంపెనీ జిల్లా సేల్స్ మేనేజర్ ఎ.బాలకృష్ణ, టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి పేర్కొన్నారు. గురువారం పాతపాళెంలో భారతి సిమెంట్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక లక్ష్మీ విఘ్నేశ్వర సిమెంట్ డీలర్ కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికులకు బీమా బాండ్లు అందజేశారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ భారతి సిమెంట్ మార్కెట్‌లో అగ్రగామిగా దూసుకెళుతోందన్నారు. మిగిలిన సిమెంట్లతో పోల్చితే మూడు రెట్లు మెరుగైన సిమెంట్‌ను భారతి కంపెనీ వినియోగదారులకు అందిస్తోందని చెప్పారు. ప్రపంచలోనే అగ్రగామి అయిన జర్మన్ టెక్నాలజీ సహకారంతో భారతి సిమెంట్ ఉత్పత్తి అవుతోందని తెలిపారు. రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ నిపుణుల విభాగం పర్యవేక్షణలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, సాటిలేని, మేటి సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. కల్తీకి అవకాశం లేకుండా ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అన్ని నాణ్యతా ప్రమాణాలను పరీక్షించిన తర్వాతనే మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. భారతి సిమెంట్ కంపెనీ భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీల సంక్షేమం కోసం కూడా కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ కంపెనీ సిబ్బంది, తాపీమేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

గృహ హింస కేసులో నిందితులకు మూడేళ్లు జైలు

వడమాలపేట (విజయపురం): గృహహింస, అదనపు వరకట్నం వేధింపుల కేసులో మూడేళ్లు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు గురువారం వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వడమాలపేట మండలం పత్తిపుత్తూరు పంచాయతీ అమ్మగుంట గ్రామానికి చెందిన శ్రీవాణి తన భర్త మదన్‌మోహన్‌రెడ్డి, అత్త నాగమ్మ, ఆడబిడ్డ రాజ్యలక్ష్మి, మామ సుబ్బారెడ్డి అదనపు వరకట్నం కోసం తనని వేధిస్తున్నారని, గృహ హింసకు పాల్పడుతున్నారని వడమాలపేట పోలీస్ స్టేషన్‌లో 2016లో ఫిర్యాదు చేసింది. దీనిపై పుత్తూరు కోర్టులో కేసు నడిచింది. 2019లో శ్రీవాణి భర్త మదన్‌మోహన్ రెడ్డి మృతి చెందారు. ముద్దాయిలు అయిన బైనగారి నాగమ్మ , రెడ్డెప్పగారి రాజ్యలక్ష్మి, సుబ్బారెడ్డికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ పుత్తూరు జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ గోపాల కృష్ణ తీర్పు చెప్పారని ఎస్ఐ పేర్కొన్నారు. అలాగే సుబ్బారెడ్డికి రూ.9 వేలు, నాగమ్మ, రాజ్యలక్ష్మిలకు రూ. 8 వేల చొప్పున జరినామా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో పుత్తూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పర్యవేక్షణలో దర్యాప్తు సాగిందన్నారు. కాగా ఏపీపీ నిర్మల, వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణరాజు పర్యవేక్షించారు.

వ్యక్తి ఆత్మహత్య



షౌకత్ అలీ(ఫైల్)

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరుకు చెందిన లారీ డ్రైవర్ షౌకత్ అలీ గురువారం తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. పోస్టు మార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్టు పోలీసులు తెలిపారు.

వైభవంగా గోవిందుని తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి వారు తెప్పపై కొలువై పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు.

వృద్ధురాలి అంత్యక్రియల్లో అపశ్రుతి





చికిత్స పొందుతున్న వెంకటరమణ, కుమార్

- బాణసంచా పేలి పలువురికి గాయాలు

గంగవరం: అంత్యక్రియలు జరుగుతున్న సమయంలో సంచిలోని బాణసంచా పేలి పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గంగవరం మండలంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. దండపల్లి గ్రామంలో ఓ వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడం కోసం సాయంత్రం శ్మశానవాటికకు బయలుదేరి వెళుతున్నారు. మృతదేహం ముందు వెళుతున్న కొంతమంది సంచిలో బాణసంచా నింపుకుని ఒక్కొక్కటే కాల్చుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు సంచిలోని టపాకాయలకు నిప్పు అంటుకుని పేలిపోయాయి. సంచిలోని బాణసంచా జనంపైకి దూసుకువెళ్లడంతో భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో వెంక టరమణ(53), కుమార్(45), బంగారుపాళెం మండలానికి చెందిన చిన్నబ్బ(63), చిన్నన్న (61) తీవ్రంగా గాయపడగా, గురవయ్య, కుమార్ బాబు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి, చిత్తూరుకు తరలించారు.

విన్నపాలకు విలువేదీ?

శతాబ్దాల భూ సమస్యలు.. సాగుకు నోచని పొలాలు.. అర్థాకలి బతుకులు.. గడవని కుటుంబాలు.. మా కష్టాలు తీర్చండయ్యా.. అంటూ ఇటీవల రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పలువురు విన్నవించుకున్నారు. అయితే ఆ అర్జీలు పరిష్కారానికి నోచుకునే పరిస్థితి కనిపించడం లేదు. రెవెన్యూ రికార్డులు అస్తవ్యస్తంగా ఉండడమే ఇందుకు కారణంగా నిలుస్తోంది. ఫలితంగా మా విన్నపానికి విలువేదీ.. మా సమస్యకు పరిష్కారమేదీ సారూ అని జనం ఆవేదన చెందుతున్నారు.

- అస్తవ్యస్తంగా రెవెన్యూ రికార్డులు
- పరిష్కారానికి నోచని రెవెన్యూ సదస్సుల అర్జీలు
- తలలు పట్టుకున్న రెవెన్యూ అధికారులు
- రికార్డుల్లో కచ్చితమైన వివరాలు లేని పరిస్థితి
- ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు తనిఖీ చేసిన జేసీ విద్యాధరి



రెవెన్యూ సదస్సుల అర్జీల కసరత్తును పర్యవేక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

డివిజన్	రెవెన్యూ సదస్సుల్లో నమోదైన అర్జీలు
పలమనేరు	4,245
చిత్తూరు	3,783
కుప్పం	1,434
నగరి	1,117
మొత్తం	10,579

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 8,22 రెవెన్యూ గ్రామాల్లో కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించి, హంగామా చేసింది. అయితే ఈ సదస్సుల్లో 10,579 అర్జీలు నమోదయ్యాయి. వీటిని కచ్చితత్వంతో పరిష్కరించాల్సిన పరిస్థితి ఉంది. అయితే ఆ అర్జీలు పరిష్కరించాలంటే అంత సులువైన పని కాదని రెవెన్యూ అధికారులు అంటున్నారు. జిల్లాలోని మండల రెవెన్యూ కార్యాలయాల్లో రికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో రెవెన్యూ సదస్సుల అర్జీలు పరిష్కరించేందుకు అధికారులు తలలు పట్టుకున్నారు.

ఎప్పుడో పరిష్కరిస్తారో చెప్పలేని పరిస్థితి

రెవెన్యూ సదస్సులు నిర్వహించి చాలా రోజులు అయ్యింది. ఆ సదస్సుల్లో నమోదైన అర్జీలు ఎప్పుడు పరిష్కారం అవుతాయన్న విషయమై అధికారులు నోరు మెదపడం లేదు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలన్నీ ఉత్తుత్తివే అని చర్చించుకుంటున్నారు. ప్రజలను మోసం చేసేందుకు ఇలాంటి సదస్సులు ఎందుకు నిర్వహించాలని ప్రశ్నిస్తున్నారు.

10,579 అర్జీలకు మోక్షం ఎప్పుడో?

జిల్లాలోని 8,22 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 10,579 అర్జీలు నమోదయ్యాయి. ఈ అర్జీలన్నింటికీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉంది. వీటిలో ఇప్పటివరకు 8 శాతం అర్జీలు సైతం పరిష్కారించలేని పరిస్థితి జిల్లాలో నెలకొంది. వంద శాతం అర్జీలను రెవెన్యూ అధికారులు ఎప్పుడు పరిష్కరిస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. తమ అర్జీకి పరిష్కారం ఎప్పుడు దొరుకుతుంది సారూ అంటు ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం తనిఖీ

రెవెన్యూ సదస్సుల్లో నమోదైన అర్జీల పరిష్కార కసరత్తును పరిశీలించేందుకు జాయింట్ కలెక్టర్ విద్యాధరి గురువారం చిత్తూరు ఆర్డీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల అర్జీలను పరిష్కరించేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆర్డీఓ కార్యాలయానికి విచ్చేసి తిష్ట వేశారు. ఆ అర్జీలు మొట్టమొదట తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం చేసినట్లు నివేదికలు సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఆ నివేదికలను ఆర్డీఓ స్థాయిలో పరిశీలించాలి. అనంతరం జాయింట్ కలెక్టర్ అర్జీలకు కచ్చితమైన పరిష్కారం ఇదేనంటూ నివేదికలు ఆమోదించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను తనిఖీ చేసేందుకు చిత్తూరు ఆర్డీఓ కార్యాలయానికి విచ్చేసిన జేసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ రికార్డులు అస్తవ్యస్తంగా ఉంటే ఎలా అని మండిపడ్డారు. రికార్డుల మేరకు రెవెన్యూ సదస్సుల్లో నమోదైన ప్రతి అర్జీకి కచ్చితమైన పరిష్కారం చూపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నా భార్య నాగొంతు కోసింది!

పుంగనూరు: 'అగ్నిసాక్షిగా తాళికట్టిన నా భార్య నాగొంతు కోసేసింది.' అని రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న ఓ భర్త రోదిస్తూ చెప్పిన సంఘటన గురువారం రాత్రి పట్టణంలోని నక్కబండలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పుంగనూరులోని నక్కబండకు చెందిన బాలు(25), గిరిజ దంపతులు కూలీపని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి ఇరువురు ఘర్షణ పడ్డారు. తన భార్య గిరిజ గొంతు కోసేసిందని రక్తపుమడుగులో ఉన్న బాలు రోదిస్తూ చెప్పడం వైరల్‌గా మారింది. ఈ విషయాన్ని పోలీసులకు తెలపడంతో సీఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకుని, 108లో బాధితుడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించనున్నారు. స్థానికులు దీనిపై పలురకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాలునే గొంతుకోసుకుని భార్యపై చెబుతున్నాడని చర్చించుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇందులో వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.